సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులకు చేర్చాలి

- కలెక్టరేట్‌లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష
- ఆ బాధ్యతను అధికారులు తీసుకోవాలి
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 23 : సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హుల ఇంటికి చేర్చే బాధ్యత అధికారులపై ఉన్నదని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు-2024 ముసాయిదాబిల్లు, ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమంతోపాటు జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. రానున్న ఐదేండ్లలో జిల్లా అభివృద్ధిపథంలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. జిల్లాలో పరిశ్రమలు, విద్యారంగం అభివృద్ధితోపాటు రూ.400 కోట్లతో అనంతగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. ఉద్యోగులకు ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నదనన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. వర్షాలతో పంట నష్టం జరిగితే అధికారులు నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రతినెలా ముఖ్యమైన శాఖలపై సమీక్షలు నిర్వహిస్తామని.. ఇందులోని ప్రతి అంశంపైనా అధ్యాయనం చేసి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా భూముల సమస్య సత్వర పరిష్కారానికి భూమాత చట్టాన్ని తీసుకొస్తున్నట్లు సభాపతి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మేధావివర్గం, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల సలహాలను పరిగణనలోకి తీసుకుని ఆ చట్టాన్ని పకడ్బందీగా చేపడతామన్నారు. 2014 కంటే ముందు ఉన్న సాదాబైనామా సమస్యలను పరిష్కరించే అవకాశమూ ఉందన్నారు. జిల్లాలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఎన్ని చెరువులు, కుంటలు నిండాయి, ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇవ్వగలుతామో క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలను సమర్పించాలని స్పీకర్ అధికారులను ఆదేశించారు. పశు సంపద సంరక్షణకు వాటికి వ్యాక్సినేషన్ వేయాలన్నారు. గురుకులాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు సమృద్ధిగా అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. వైద్యారోగ్య, విద్యుత్తు, మైనింగ్, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పనులపై ఆరా తీశారు. సమీక్షలో చేవెళ్ల లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి , ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ చైర్పర్సన్లు మంజులారమేశ్, స్వప్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఔటర్ రింగ్ రోడ్డు బయట ఉన్న తారామతిపేట, బాచారం గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దని తారామతిపేట మాజీ ఎంపీటీసీ వెంకటేశ్ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ఉన్న గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే అధిక పన్నులు, చార్జీలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉన్నదన్నారు. ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉన్నదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి కూడా పలుమార్లు తీసుకెళ్లినట్లు చెప్పారు. మున్సిపాలిటీలో గ్రామాల విలీనం విషయం తమ దృష్టిలో ఉన్నదని.. వినతులు పరిశీలిస్తామని మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు

-పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 23

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్

కల్తీ కల్లు అని నిర్ధారణ కాలేదు

- ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్

వికారాబాద్, ఆగస్టు 23 : కల్తీ కల్లు అని నిర్ధారణ కాలేదని..ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ మండలంలోని పీరంపల్లి గ్రామానికి చెందిన కొందరు కల్లు తాగి అస్వస్థతకు గురైనట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సంబంధిత అధికారులను పీరంపల్లికి పంపించి వివరాలు సేకరించామని.. కల్లును పరీక్షించగా కలుషిత నీరని తెలిసిందన్నారు. అయినప్పటికీ ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. కల్లు తాగడంతోనే కొందరు అస్వస్థతకు గురైనట్లు ఆరోపణలున్నాయన్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో కలుషిత నీటితో డయేరియా, కలరా, విషజ్వరాలు వచ్చాయనే అనుమానం ఉందన్నారు. 20, 21, 22 తేదీల్లో పీరంపల్లి చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని కల్లు దుకాణాలను సైతం పరీక్షించామని.. వాటి శాంపుళ్లను సేకరించి, కేసు రాసి కోర్టుకు పంపించామన్నారు. రెండు రోజుల్లో అవి ల్యాబ్‌లకు వెళ్తాయన్నారు.

వచ్చిన రిపోర్టుల ఆధారంగానే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మా శాఖ తరపున ఎలాంటి లోపాల్లేవన్నారు. కలుషిత నీరు కావొచ్చనే అనుమానం ఉందన్నారు. జిల్లాలో మొత్తం 2,246 లైసెన్స్ దుకాణా లున్నాయని, వాటిలో ప్రతినెలా శాంపుళ్లను సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాఘవీణ, ఎస్సై పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి : విశ్వేశ్వర్‌రెడ్డి

కల్తీ కల్లుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని మిషన్ దవాఖానలో చికిత్స పొందుతున్న పీరంపల్లి కల్తీ కల్లు బాధితులను ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ అవినాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... అది ఈత, తాటి కల్లు కాదని.. డైజోఫామ్‌తో తయారు చేసిన కృత్రిమ కల్లు అని పేర్కొన్నారు. కల్తీ కల్లును పూర్తిగా నిషేధించాలని..అనుమతుల్లేకుండా కొనసాగుతున్న కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. చాలామంది కల్తీ కల్లు బారి న పడుతున్నారన్నారు. దుర్గయ్య ఎలా మృతి చెందాడనే విషయం పోస్టుమార్టం రిపోర్టు, ల్యాబ్‌లో కల్లు శాంపిళ్లు పరిశీలించిన తర్వాత తెలుస్తుందన్నారు. బాధితులకు న్యాయం చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు నందు, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరోత్తంరెడ్డి, బస్వలింగం తదితరులు ఉన్నారు.

కల్తీ కల్లు బాధితులను పరామర్శిస్తున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి

పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మనోహర్‌కుమార్ రాథోడ్

షాద్‌నగర్ పట్టణంలోని బాలికల వసతి గృహంలో భోజనం చేస్తున్న పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మనోహర్‌కుమార్‌రాథోడ్

షాద్‌నగర్, ఆగస్టు 23 : వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మనోహర్ కుమార్ రాథోడ్ వార్డెన్లను హెచ్చరించారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలతోపాటు బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణ, నాణ్యతను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వసతి గృహాలకు సరఫరా అయ్యే ఆహార వస్తువులు, బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దని.. నాసిరకంగా ఉంటే కచ్చితంగా ఫిర్యాదు చేయాలని వార్డెన్లు, మధ్యాహ్న భోజన నిర్వా హకులకు సూచించారు. హాస్టళ్లలో బియ్యంతోపాటు ఇతర వస్తువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల వివరాలు, హాజరు, భోజనం మెనూ వంటి రికార్డులను పరిశీలించారు. వంట ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు ఆయన అక్కడే భోజనం చేశారు. ఆయన వెంట పౌర సరఫరాల శాఖ అధికారులు పుల్లయ్య, శ్రీనివాసులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్నంలో మానవహారం..

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు చరణ్ మాట్లాడుతూ..కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, వంశీ, విప్లవ్‌కుమార్, లక్ష్మణ్, అజయ్, రోహిత్ తదితరులున్నారు.

-ఇబ్రహీంపట్నం రూరల్, ఆగస్టు 23

అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల రాకెట్ గుట్టురట్టు

- 60 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, మారుతి కారు స్వాధీనం
- జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న ఎస్‌వోటీ పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు.. పరారీలో మరో నలుగురు

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

యాచారం, ఆగస్టు 23 : ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల రాకెట్ గుట్టును యాచారం పోలీసుల సహకారంతో మహేశ్వరం ఎస్‌వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్)పోలీసులు శుక్రవారం రట్టు చేశారు. 60 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామారాజు జిల్లా, హుకుంపేట మండలంలోని అల్లంపుట్టు గ్రామానికి చెందిన కొర్రబాబు, అతడి బంధువైన దుమ్ముడిగూడ మండలంలోని బోడిగూడ గ్రామానికి చెందిన కామేశ్వర్ వ్యవసాయం చేసేవారు. దానితో వచ్చే సంపాదన సరిపోక గంజాయిని విక్రయిస్తూ లాభాలను గడిస్తున్నారు. కాగా కొర్రబాబు మిత్రుడైన గిరీశ్ బెంగళూరులో నివసిస్తున్నాడు. అతడు తనకు గంజాయి కావాలని కొర్రబాబు, కామేశ్వర్‌లను చెప్పాడు. కిలో గంజాయి రూ.10,000 చొప్పున విక్రయిస్తే 60 కేజీలకు రూ. 6,00,000 చెల్లిస్తానని గిరీశ్ వారితో ఒప్పందం చేసుకున్నాడు. కాగా కొర్రబాబు, కామేశ్వర్ గంజాయిని బెంగళూరుకు తీసుకెళ్లి గిరీశ్‌కు అప్పగించేందుకు విశాఖపట్నం జిల్లా గోపాలపట్నానికి చెందిన షేక్ మస్తాన్‌వలి, విశాఖపట్నం జిల్లా వెంకటపాలెంకు చెందిన మల్లేశ్వర్‌రావులను మధ్యవర్తులుగా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ నలుగురు కలిసి ఏపీలోని నర్సీపట్నం మండలంలోని వేములపూడి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌నాయుడి వద్దకు ఈ నెల 21 మారుతి కారులో వెళ్లి గంజాయిని కిలోకు రూ.ఐదు వేల చొప్పున మొత్తం రూ.3,00,000 చెల్లించి 60 కిలోల గంజాయిని కవర్లలో నింపుకొన్నారు. అక్కడి నుంచి నాగార్జునసాగర్, ఖమ్మం, మిర్యాలగూడ, మల్లెపల్లి, యాచారం మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు యాచారం పోలీసుల సహకారంతో మాల్ సరిహద్దు (అంతర్‌జిల్లా) చెక్‌పోస్టు వద్ద మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు ఈనెల 22 సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తూ అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొర్రబాబు, కామేశ్వర్‌లను అదుపులోకి తీసుకోగా షేక్ మస్తాన్‌వలి, మల్లేశ్వర్ పరారయ్యారు. పోలీసులు వారి వద్ద నుంచి 60 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, మారుతి కారును స్వాధీనం చేసుకున్నారు. షేక్ మస్తాన్, మల్లేశ్వర్, గిరీశ్, శ్రీనివాస్‌రావులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో యాచారం సీఐ శంకర్‌కుమార్, ఎస్ఐలు మధు, సత్యనారాయణలు పాల్గొన్నారు.

మంకీ పాక్స్ నోడల్ కేంద్రాలుగా

గాంధీ, ఫీవర్ దవాఖానలు

20 పడకలతో ప్రత్యేక వార్డుల ఏర్పాటు

గాంధీ దవాఖానలో ఏర్పాటైన ప్రత్యేక వార్డు

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కరోనా వైరస్ తర్వాత ఎలాంటి వైరస్‌లు వచ్చినా జనాలు కొంత భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే మంకీ పాక్స్ అనే వైరస్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అలజడి సృష్టిస్తున్నది. రోజురోజుకూ పెరుగుతున్న కేసుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలను అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగానే కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచనల మేరకు తెలంగాణ సర్కార్ సైతం మంకీపాక్స్‌ను ఎదుర్కొనే దిశగా ముందస్తు చర్యలను ప్రారంభించింది. రాష్ట్రంలో ఒకవేళ కేసులు నమోదైతే చికిత్స అందించేందుకు గాంధీ, నల్లకుంటలోని ఫీవర్ దవాఖానలను నోడల్ కేంద్రాలుగా ప్రకటించింది. గాంధీలో 14 పడకలతో కూడిన మంకీపాక్స్ వార్డును ఏర్పాటు చేసింది. ఎక్కడైనా మంకీపాక్స్ కేసులు నమోదైనా లేక అనుమానిత లక్షణాలున్నా ఆ రోగులకు ఈ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చికిత్స అందించనున్నట్లు గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమారి వెల్లడించారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వార్డులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా కేసులు నమోదు కాలేదని, ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు మంకీపాక్స్ వార్డులను ఏర్పాటు చేశామన్నారు. ఈ వైరస్‌కు ప్రత్యేక చికిత్స అం టూ ఏమీలేదని, సపోర్టింగ్ ట్రీట్‌మెంట్ మాత్రమే ఉంటుందన్నారు.

ఫీవర్ హాస్పిటల్‌లో..

నల్లకుంటలోని ఫీవర్ దవాఖానలోనూ ముందు జాగ్రత్త చర్యగా ఆరు పడకలతో మంకీపాక్స్ వార్డును ఏర్పాటు చేసినట్లు దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. మంకీపాక్స్ బాధితులు, అనుమానిత లక్షణాలున్న వారికి నిర్ధారణ పరీక్షలు చేసి, ఈ వార్డులో చికిత్స అందించేందుకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి కేసులు, అనుమానిత కేసులు రాలేదని, కేవలం ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే ఈ వార్డును ఏర్పాటు చేశామన్నారు.

హాస్టళ్లలో తనిఖీలు

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు పలు ప్రాంతాల్లోని కళాశాలలు, హాస్టళ్లలో వంటగది, సామగ్రి, స్టోరేజ్ ఏరియా, తయారు చేసిన ఫుడ్ ఐటమ్స్, రా మెటీరియల్‌తో పాటు పారిశుద్ధ్య నిర్వహణ వంటవి పరిశీలించారు. ఈ నెల 21 నుంచి శుక్రవారం వరకు మొత్తం 28 ప్రైవేట్, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశారు. ఎల్బీనగర్ జోన్‌లో నాలుగు రెసిడెన్షియల్ హాస్టళ్లు, చార్మినార్‌లో 6, ఖైరతాబాద్‌లో 5, శేరిలింగంపల్లిలో 5, కూకట్‌పల్లిలో 4, సికింద్రాబాద్ జోన్‌లో 4 ప్రైవేట్, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు

నకిలీ ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు..

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : మల్కాజిగిరి సర్కిల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరుతో డ్రగ్ మార్ట్ వ్యాపారాన్ని తెరిచేందుకు ఒక లైసెన్స్, మరొకటి 'డ్రగ్స్ మార్ట్ ఇన్ కాంగ్రెస్' పేరుతో మరొకటి కలిపి రెండు ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో జీహెచ్ఎంసీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు ఈ రెండింటికీ టిన్ నంబర్లను బ్లాక్ చేస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసిన సంబంధిత అధికారులపై చర్యలు మాత్రం తీసుకోకపోవడం గమనార్హం.

1200 ఆస్తుల సేకరణ

7.5 కి.మీటర్ల మేర పాతనగరంలో మెట్రో

భూసేకరణ వేగవంతం..8 నెలల్లో ప్రక్రియ పూర్తికావొచ్చు

400 ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్లు జారీ

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పాతనగరంలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మిస్తున్న మెట్రో మార్గం కోసం భూసేకరణ వేగంగా జరుగుతున్నదని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎంజీబీఎస్ వరకు ఉన్న మార్గాన్ని పాతనగరం మీదుగా చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కి.మీ మేర నిర్మిస్తున్నామని, ఇందు కోసం సుమారు 1200 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని చెప్పారు. భూసేకరణ చట్టం -2013 కింద 400 ఆస్తులకు సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. వివిధ పత్రికల్లోనూ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు ఇచ్చి ఆస్తులను సేకరించే ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ జరుగుతున్నదన్నారు. అదేవిధంగా మెట్రో స్టేషన్లు నిర్మించే ప్రాంతాల్లో మాత్రం రోడ్డు 120 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టాల్సి ఉంటుందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. దారుల్ షిపా జంక్షన్ నుంచి శాలిబండ వరకు ప్రస్తుతం రోడ్డు వెడల్పు 50 అడుగుల నుంచి 60 అడుగుల వరకు, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట జంక్షన్ వరకు 80 అడుగులు ఉందన్నారు. అందువల్ల దారుల్‌షిపా-శాలిబండల మధ్య చాలా ఆస్తుల విషయంలో ఒక్కొక్కటీ 20-25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుందని, అలాగే శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఒక్కో ఆస్తిని 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని వివరించారు. మెట్రో స్టేషన్లు, వంపులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్తా ఎక్కువగా ఉంటుందన్నారు.

మెట్రో మార్గంలో లైడార్ డ్రైన్ సర్వే..

సంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతోపాటు 3డీలో వీక్షించేలా లైడార్ డ్రైన్ సర్వే సైతం చేసినట్లు ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభావితమయ్యే ఆస్తులతోపాటు చుట్టు పక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించవచ్చన్నారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. 7.5 కి.మీ మేర నిర్మించే మెట్రో కారిడార్‌లో 103 మతపరమైన, సున్నితమైన కట్టడాలు ఉన్నాయ ని, వాటి పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. భూసేకరణ చట్టం అనుసరించి చేపడుతున్న ఈ భూసేకరణ కార్యక్రమం 8 నెలల్లో పూర్తి కావచ్చని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

తిట్లు.. ట్వీట్లు..

మెట్రో కార్యకలాపాలపై ప్రయాణికుల గరం గరం.. 'సురక్షిత ప్రయాణం ఏందో ఏమో గానీ... జర్నీ మాత్రం కాస్ట్‌లీగా మారింది. రద్దీ అనుగుణంగా కోచ్‌లను పెంచరు. కానీ మెట్రో పార్కింగ్ పేరుతో భారీగా వసూళ్లకు తెగబడుతున్నారు. నిల్చుందామంటే స్థలం ఉండదు. మెట్రో రైలు ఎక్కే సమయంలోనూ తోసుకుంటూ ఎక్కాల్సి వస్తోంది..' అంటూ మెట్రో కార్యకలాపాలపై ప్రయాణికులు గరం గరం అవుతున్నారు. సోషల్ మీడియా వేదికగా మెట్రో సేవలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఆగస్టు 25 నుంచి నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పెయిడ్ పార్కింగ్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుందని లక్షలాది మంది మెట్రోను ఆశ్రయిస్తున్నారు. తమ ద్విచక్ర వాహనాలను మెట్రో స్టేషన్ల దగ్గర ఉచితంగా ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసి..నిత్యం మెట్రో రైలు రాకపోకలు సాగిస్తున్నారు. అలాంటి వారికి షాకింగ్ ఇస్తూ ఆగస్టు 25 నుంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తామంటూ ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహిస్తున్నా రు. ఈనెల 14న మెట్రో స్టేషన్‌లో ఆందోళనకు దిగిన ప్ర యాణికులు, మరోసారి ఈనెల 25న మహాధర్నాను నిర్వహిం చనున్నట్లు సమాచారం.

దారితప్పుతున్న మోడల్

- నీరుగారుతున్న బల్దియా లక్ష్యం..
- ఇతర అవసరాలకు మోడల్ మార్కెట్ల వినియోగం

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ప్రతి పది వేల మంది జనాభాకు ఒక ఆదర్శ మార్కెట్ ఉండాలన్న లక్ష్యం నీరుగారుతున్నది. అందుబాటులోకి వచ్చిన మోడల్ మార్కెట్లను ఇతర అవసరాల పేరిట ప్రైవేట్‌పరం చేసే పనిలో ఉన్నారు. వాస్తవంగా అందుబాటులోకి వచ్చిన చోట స్థానికులకు సూపర్ మార్కెట్లా ఈ మోడల్ మార్కెట్లు ఉపయోగపడాలి. కానీ మోడల్ భవనాలను ఏకంగా సీఎస్ఆర్ కింద ఫౌండేషన్లకు అప్పగిస్తున్నారు. తాజాగా, సీఎస్ఆర్ కింద డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్, బయోలాజికల్ ఈ లిమిటెడ్‌కు మోడల్ మార్కెట్ భవనాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఏడాదిపాటు అప్పగించారు. స్కిల్లింగ్ అండ్ లివ్లీహుడ్ ప్రోగ్రాం కింద స్లమ్స్‌లోని పేద మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ఆయా అంశాల్లో తగిన శిక్షణతో నైపుణ్యం కల్పించడంతో పాటు వారికి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభించేలా, ఉపాధి పొందేలా సహకరిస్తామని సదరు ఫౌండేషన్ జీహెచ్ఎంసీకి తెలియజేసింది. ఈ మేరకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలుపగా, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో ఏడాదిపాటు ఒప్పందం కుదుర్చుకున్నది. అయితే మున్ముందు ఇంకెన్ని మోడల్ మార్కెట్ భవనాలు ఇతర అవసరాలకు మళ్లిస్తారో చూడాల్సి ఉన్నది.

ప్రత్యేకతలతో మార్కెట్లు

ప్రశాంతమైన వాతావరణం